"అయిపోయింది

[redacted] ధర్మజా...

పూర్తిగా ఓడిపోయావు. రాజ్యం, ఆస్తి, సోదరులు, చివరికి నిన్ను నువ్వు కూడా పణం పెట్టి ఓడిపోయావు..." అని వికటంగా నవ్వాడు శకుని.

అవనత శిరస్కుడయినాడు ధర్మజుడు.

ఆశ...ఓడాడు తను...ఏమో...మరొక్క ఆట ఆడితే పోగొట్టుకున్నదంతా తిరిగి పొందవచ్చునేమో. ఆశామోహం మళ్ళీ చుట్టుకుంది. తన సోదరులపైనా, రాజ్యం పైనా వున్న తనధికారాన్ని దుర్వినియోగం చేసుకున్నాడు తను. ధర్మజుడి కలలు అవమాన, అసహన భారాలతో మంకెన పువ్వులయినాయి.

మాయా ద్యూతాన్ని వీక్షిస్తున్న కౌరవ ప్రముఖులు ఈసిగొలుపుతున్నారు, ఉక్రోష పరుస్తున్నారు.

మరొక మారు ప్రయత్నిస్తే... పరాజయ భారం తప్పదేమో... ఇన్ని అపజయాలను ఎదుర్కొన్న ఈ శరీరం మరొక్క అపజయానికే కుంగేనా? అయినను ఫర్వాలేదు. "మరొక్క ఆట...నాకు మిగిలిన ఒక్క ఆస్తి అయిన నా అర్ధాంగి పాంచాలిని పణంగా పెడుతున్నాను" భావ రహితంగా పలికింది ధర్మనందనుడి స్వరం.

పాంచాలి వస్తువా?

స్త్రీని పణంగా పెట్టే అధికారం పురుషుడికి వున్నదా? కానీ అది జరిగింది...

అయినా ధర్మరాజు ధర్మ-రాజుగానే మిగిలిపోయాడు చరిత్ర పుటలలో.

ఇది చరిత్ర......ఇది ఇతిహాసం...

కాని వాస్తవం......???

ప్రస్తుతం???

సృష్టిని నడిపిస్తున్న ఒకే ఒక శక్తి.

ధనం...ఆశ...ఆశ ఇంటు...ఆశ ఇంటు...ఆశ ఇంటు

.........................................................

అనుక్షణం ప్రతి మనిషీ ఆడుతున్న ఆట...

కాదు-దాదాపు ప్రతి మనిషీ ఆడుతున్న ఆట...

జూదం......

చదువుతున్న పుస్తకం ప్రక్కన పడేశాడు కృష్ణ... కృష్ణ చైతన్య.

చిరాకేసింది తనకి. అదేదో తప్పులా రాస్తారు ప్రతి ఒక్కళ్ళూ...

ప్రపంచంలో కూకటి వేళ్ళతో పాతుకుపోయిన విషయాన్ని ఎవరు కాదనగలరు? జూదం కానిదేది? జీవితమే జూదం కదా!

తిండి తిని అరిగేవరకూ అందులో విషం లేదని, పీల్చే గాలిలో ఆ క్షణాన విషం లేదని, నిద్రపోతే లేవడం ఖాయమని చెప్పగలమా?

ప్రతిదీ రిస్కే...జూదమే...

ఆ మాత్రం రిస్కులు తీసుకున్నవాడే అంచెలంచెలుగా పైకి రాగలడు. అవకాశాన్ని అందుకోగలడు.

అలా ఛాలెంజ్‌గా జీవితాన్ని రిస్క్‌గా మలచుకుని ఆడుకుని వుండకపోతే తానీరోజు ఈ స్థితికి చేరేవాడే కాదు. ఆఫ్టరాల్ ఇంటర్ దాటి చదవలేకపోయిన తను చిన్న ఉద్యోగం మానుకుని, షేర్ల మీదా, రేసుల మీదా విజృంభించి ఎంతో చాకచక్యంతో లక్షలార్జించి ఓ పెద్ద సంస్థకి అధినేత అయ్యాడంటే దాని వెనక ఎంత రిస్క్ తీసుకున్నాడు తను!!! లేచి తలుపు దగ్గరికి నడిచాడు కృష్ణ. బయటికి వచ్చి ఇంటి ఎదురుగా వున్న లాన్‌లో నడుస్తూ అప్రయత్నంగా గోడకవతల రోడ్డుపైకి దృష్టి సారించాడు.

ఆరోజు ఆదివారం కావడంతో ఇంట్లోనే వున్నాడు. కృష్ణ అంటే అది పూర్తిగా నిజం కాదు.

కారణం అతను ఆదివారాలూ ఇంట్లో వుండడం సాధారణంగా జరగదు. ఎప్పుడూ వ్యాపారం, ధనార్జనలు తప్ప మరో ఆలోచన రాదు అతనికి.

ఇంట్లో వుండేదే సగటున రోజుకి ఆరు గంటలతను. అందులో మూడు గంటలు నిద్రకి పోగా మిగిలిన మూడు గంటలూ భార్యతో పోట్లాడడంతో గడిచిపోయేది.

వ్యాపార సంబంధమైన టెన్షన్‌లను తను భార్య మీద తీర్చుకోవడంవల్ల అలా నిరంతరం వారిద్దరికీ ఘర్షణలు, లేక తనని ఏ మాత్రం గుర్తించని భర్త వచ్చిన కొంతసేపు కోపంగానే వుండడం భరించలేని సీత ఎదురు తిరగడం వల్ల ఘర్షణలు జరిగేవో చెప్పడం కష్టం గాని అస్తమానమూ వారిద్దరి మధ్యా గొడవలు జరగడం మాత్రం నిజం.

కృష్ణ గోడ మీదుగా రోడ్డు వైపుకి దృష్టి సారించే సమయానికి సరిగ్గా ఎనిమిది గంటలవుతోంది ఆ ఆదివారం ఉదయం. అక్కడ కనిపించిన దృశ్యానికి ముందు ఆశ్చర్యమూ, వెంటనే కుతూహలమూ కలిగాయి అతనికి.

ముగ్గురు పిల్లలు ఆడుకుంటున్నారక్కడ.

ఎనిమిది పదుల మధ్య వుంటుంది వారి వయసు.

అందులో ఆశ్చర్యపడవలసిన విషయమేమీ లేదు.

అయితే కృష్ణను ఆశ్చర్యపరిచింది పిల్లలాడుకుంటున్న విషయం కాదు. ఆ ఆట పద్ధతి.

రోజూ ప్రొద్దున్న డైరీ పాలు ఉపయోగించి బయట పడేసిన పాల పేకెట్లు ఖాళీవి ఏరుకుని కొట్లలో అమ్మి డబ్బు సంపాదించుకునే పిల్లలు వారు.

ఒక్కొక్కడి దగ్గరా సుమారు పది, పన్నెండు పాల పాకెట్లున్నాయి. ఆ పాకెట్లు ప్రక్కనే వుంచుకుని ఓ అయిదు పైసల నాణెంతో బొమ్మా బొరుసా ఆడుకుంటున్నారు వాళ్ళు—ఆ పాల పాకెట్లను పందెం కాసి...... అబ్బురపడ్డాడు కృష్ణ.

ఈ పసి వయసులోనే ఆ పిల్లలలో ఎంత ఛాలెంజ్? ఎంతటి ఉత్సాహం? ఎంతటి రిస్క్ ఎలిమెంట్?

అన్ని పాకెట్లనూ తానే గెలుచుకుని, అన్నీ అమ్మి ఇంటికి ఎక్కువ డబ్బులు పట్టుకెళ్ళాలని వాళ్ళలో ఎంతటి ఆరాటం? ఒకవేళ అన్ని పాకెట్లూ ఓడిపోతే ఆ రోజుకిక పస్తే అన్న ఆలోచనని ప్రక్కకి నెటి, గెలుపు కోసం ఎంత జోరుగా ఆడుకుంటున్నారు?

కృష్ణకి వాళ్ళందరిలోనూ తన పోలిక కనిపించింది.

తనలా వారందరిలోనూ ఓ పట్టుదలా, ఓ ధ్యేయం వున్నాయి.

గుడ్...

తనలాగే వాళ్ళూ ఏదో రోజున బాగా పైకి వస్తారు. జీవిత వైకుంఠపాళిలోని ఒక్కో మెట్టే స్పీడుగా ఎక్కుతూ తనలాగే ముప్పై రెండో ఏటకే ఆకాశాన్నందుకో గలరా? తప్పకుండా......

ఈ దృశ్యం అతనిలో ఎంతటి ఆశ్చర్యాన్ని కలిగించిందో ప్రక్కనే వున్న మరో పిల్లవాడు అతనిలో అంతటి కుతూహలాన్నీ కలిగించాడు.

ఆ పిల్లవాడి చేతిలో అయిదే పాకెట్లున్నాయి.



వాటినలాగే గుండెలకి హత్తుకుని ఆ ఆడుతున్న వారివైపు కాస్త విసుగ్గానూ, నిర్వికారంగానూ చూస్తూ నిల్చున్నాడతను.

చూస్తున్నకొద్దీ కృష్ణలో కుతూహలం పెరగసాగింది. ఇక ఉండబట్టలేక గేటు తెరచి ఆ నిల్చున్న కుర్రవాణ్ణి పిలిచాడు. అతనికో పన్నెండేళ్ళుంటాయి. కృష్ణ పిలిచే సరికి క్షణం తటపటాయించి, బెరుగ్గా వచ్చి నిల్చున్నాడతను. చేతిలో పాకెట్లు కృష్ణ తీసేసుకుంటాడేమో అనే భయం వంటి భయం గోచరించింది అతని కళ్ళలో.

అప్పటికే ఆడుతున్న ముగ్గురు పిల్లలూ తమ ఆటలో మునిగి వుండిపోయారే తప్ప తలెత్తి చూడలేదు.

'ఎంతటి కాన్సన్ట్రేషన్-ఎంత పట్టుదల- ఏం ధ్యేయం...' మరోసారి అనుకున్నాడు కృష్ణ.

"నీ పేరేవిటి?" అడిగాడు.

"...కృష్ణ" ఇంకా బెదురు పూర్తిగా పోలేదా కుర్రాడిలో—కృష్ణ ప్రశాంతంగా అడిగినా సరే......

"నా పేరు కూడా అదే..." నవ్వుతూ అన్నాడు కృష్ణ. తిరిగి "నా పేరు కృష్ణ చైతన్యలే......"అన్నాడు.

అతని నవ్వు చూడగానే ఆ కుర్రవాడిలో బెరుకు దాదాపు పోయింది. అతను కూడా నవ్వాడు.

"నా పేరు వట్టి కృష్ణే"

"ఏం చేస్తారు మీరా పాకెట్లు?"

"........"

"ఏం చేస్తారు?" మళ్ళీ అడిగాడు.

మళ్ళీ కొద్దిగా భయం కనబడిందతని కళ్ళలో.

"భయపడకు. నేనేం చెయ్యనులే...ఏం చేస్తారా పాకెట్లు?"

"కొట్లో అమ్ముకుంటాం"

"ఓ...మరి వాళ్ళతో నువ్వాడవేం?"

"......"

"ఏం"

"నాకు...నాకు భయం సార్"

"ఎందుకు? గెలిస్తే ఎక్కువ పాకెట్లమ్ముకోవచ్చుగా?"

"........."

"ఏం? కాదా? ఎక్కువ డబ్బులొస్తే మంచిదిగా?"

"అసలు రాకపోతే కష్టం గదా సర్?"

"ఏవిటి కష్టం...?"

"మా ఇంట్లో నేను పాకెట్లమ్మి తెచ్చేవి, మా అమ్మ అప్పడాలొత్తితే వచ్చేదీ సరిపోయి కాస్త మిగులు తుంది కూడా. నేను ఓడిపోతే తక్కువ పడుతుందిగా?"

"పోనీ...ఒకటి రెండుసార్లు తక్కువ పడితే ఏం? చూడు కృష్ణా... జీవితం వైకుంఠపాళి లాంటిది. తొందరగా మెట్లెక్కి పైకి చేరుకోవడానికి ప్రయత్నించాలి. లేకపోతే జీవితానికి ఎదుగుదల ఉండదోయ్."

ఆ కుర్రాణ్ణి చూస్తే ఎందుకో జాలేసింది కృష్ణకి. ఎలాగోలా అతనిలో ఓ తేజం, ఓ ఛాలెంజ్ కలిగించాలనిపించింది. అందుకే అన్నాడామాట. ఆ కుర్రవాడు తల ఎత్తి ఆతనికేసి చాలా సేపు చూస్తూండిపోయాడు. ఈలోగా ముగ్గురు కుర్రాళ్ళలో ఇద్దరి దగ్గర పాకెట్లన్నీ అయిపోవడంతో లేచారు వాళ్ళు. గెలుచుకున్న కుర్రవాడు హుషారుగా వెళ్ళిపోయాడు. ఓడినవారిలో ఒకడు వీళ్ళ దగ్గరికి వచ్చాడు. అతనిలో ఓడిపోయానన్న బాధ ఏ కోశానా కనిపించలేదు.

"రారా...పోదాం" అన్నాడతను.

కృష్ణపై నుండి చూపులు ఇంకా తిప్పుకుండానే అన్నాడు ఆ కుర్రవాడు, "ఏమో సార్...నాకిలాగే బాగుంది... మా అమ్మ చెప్పింది... తృప్తి చాలా అవసరమని."

ఆ మాటని వెనుదిరిగా డా కుర్రవాడు.

వెళ్ళిపోయారు ఇద్దరూ.

ఓసారి నిట్టూర్చి, ఇంట్లోకి నడిచాడు కృష్ణ.

అకారణంగా అతనికి భార్యసీతమీద కోపమొచ్చింది. ఎప్పుడూ తనకి కనిపించడం లేదే, తనతో గడపడం లేదే అని గోలపెట్టి తనని అదుపులో పెట్టాలని ఆమె ప్రయత్నిస్తూ వుండి వుండకపోతే ఈ పాటికి తను ఒకటి కాక మరికొన్ని సంస్థలకి అధిపతి అయి వుండ గలిగే వాడేమో.

అతనింట్లోకి నడిచిన పది నిముషాల్లో ఎప్పట్లాగే తిరిగి ఆ ఇంటి గోడలు మాటల బలానికి అదిరాయి.

ఓ అరగంట అలా అదిరాక చెప్పలేసుకొని తిరిగి విసురుగా బయటికి నడిచాడు కృష్ణ- కృష్ణ చైతన్య.

"ఛీ ఛీ...... క్షణం మనశ్శాంతి లేదు కదా" అనుకుంటూ ప్రపంచంలో అన్నింటి కన్న, అందరికన్నా నిజాయితీగా తన పని తాను చేసుకుపోయేది ఒక్కటే వుంది.

అది ఎప్పట్లాగే తన పని తాను చేసుకుపోతోంది...

క్షణాల్నీ, గంటల్నీ, రోజుల్నీ, వారాల్నీ, నెలల్నీ, సంవత్సరాల్నీ తనలో కలిపేసుకొంటుం......

కాలం......

కాలం అడ్డం వచ్చిన జీవాల్ని కూడా తనలో కలిపేసుకొంది. కొన్ని జీవాల్ని తనతోపాటు పెంచుతూ పోయింది కూడా. సీత కాలగర్భంలో కలిసిపోయింది.

కృష్ణ తన జీవితంలోని యాభై అయిదు సంవత్సరాలని దాటేశాడు.

మార్పు లేకుండా, క్రమం తప్పకుండా మిగిలినవి రెండే రెండు. ప్రకృతి...... నిరుద్యోగ సమస్య.

వ్యాపారంలో బాగా దెబ్బ తిని పూర్తిగా నాశనమైన తండ్రి పూర్తి చేయించగలిగిన డిగ్రీ, నాలుక గీసుకోవడానికి కూడా పనికిరాని స్థితిలో కృష్ణ ఒక్కగానొక్క కొడుకు వాత్సల్య ప్రపంచంలోని నిరుద్యోగుల సంఖ్యను మరో అంకెకి పెంచాడు.

ఆర్థికంగా పూర్తిగా దిగజారిన కృష్ణ కొడుకు ఉద్యోగం కోసం తన మాజీ మిత్రులని నమ్ముకోవలసిన స్థితి ఏర్పడి ఆ నమ్మకం పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో మానసికంగాకూడాపూర్తిగా దిగజారిపోయాడు.

గత్యంతరం లేని స్థితిలో దాదాపు తనకు కొంత తెలిసిన, పూర్వాశ్రమంలో తన వ్యాపారంలో ఎదురైన ప్రతి కంపెనీలోనూ స్వయంగా వెళ్ళి కొడుకుకి ఉద్యోగం కోసం ప్రయత్నించసాగాడు కృష్ణ. సాఫీగా సాగుతుందనుకునే కాలం అనుకున్నట్టుగానే సాగితే అది కాలమెందుకు అవుతుంది?

కృష్ణ విషయంలో సరిగ్గా అలాగే జరిగింది.

ఒక్కసారిగా రెండు ఎదురు చూడని సంఘటనలు



అతనిని పూర్తిగా 'నిజం' వైపుకి తోశాయి.

ఆనాడు ఎంతో నీరసంగా 'ది డెవలపర్స్' కంపెనీ లోకి అడుగుపెట్టాడు 'కృష్ణ చైతన్య'

అరగంట బయట విజిటర్స్ రూంలో వెయిట్ చేశాక పిలుపొచ్చిందతనికి జనరల్ మేనేజర్ గదినుండి.

లోపల చాలా చల్లగా వుంది వాతావరణం.

జి.ఎమ్. డెస్కు విశాలంగా, అర్ధ చంద్రాకారంగా వుంది. యువకుడే అతను.

"కూర్చోండి" అన్నాడతను.

గది చాలా నీట్‌గా సర్దబడి వుంది.

కూర్చున్నాడు కృష్ణ చైతన్య.

"నన్ను...... శ్రీనాథ్‌గారు పంపారు...... మిమ్మల్ని కలవమని మీకు ఫోన్‌లో చెబుతానన్నారు..." నసిగాడు.

..."అవునవును. మీ అబ్బాయి రాలేదా?" అడిగాడు. "లేదు. ముందు నేనే మిమ్మల్ని కలిసి అసలు నేనెప్పి వుండే పక్షంలో వాణ్ణి పంపుదామనీ......" తిరిగి నసిగాడు.

"సరే...... రేపు పంపండి ఇంటర్వ్యూకి."

లేచలేదు కృష్ణచైతన్య.

"సార్... ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. పైసా ఆదాయం కూడా లేదు...... మీరు ఆదుకోకపోతే......" అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మీరంతగా బాధపడకండి మాష్టారూ, శ్రీనాథ్ గారంతా చెప్పారు. నేను సిన్సియర్‌గా ప్రయత్నిస్తాను. ఓ.కే.?" అన్నాడు జి.ఎమ్.

అంతసేపూ అతను తనని అదోలా తీవ్రంగా, పరీక్షగా చూస్తూండటం కృష్ణ చైతన్య గుర్తించలేదు.

లేచి థాంక్స్ చెప్పి తలుపుకేసి నడిచాడతను.

"ఎక్స్ క్యూజ్‌మీ......" పిలిచాడు జి.ఎమ్.

తిరిగి చూశాడు కృష్ణ చైతన్య.

"మీ పేరు...... కృష్ణగారు కదూ?"

అవునన్నట్టు తల వూపాడు.

జి.ఎమ్. ముఖంలో అదోరకం ఆనందం కనిపించింది. లేచి నిలబడ్డాడు అతను.

"ఇందాకట్నుంచి మిమ్మల్నెక్కడో చూశానే అని ఆలోచిస్తున్నాను. మీ ఇల్లు సంతోష్ నగర్‌లో కద్సార్?"

తిరిగి అవునన్నట్టు తల వూపుతూ అతనికేసి పరీక్షగా చూశాడు. ఈ వ్యక్తిని తానెక్కడా చూసినట్టు లేదే అనిపించింది అతనికి.

"మీరు నన్ను గుర్తుపట్టడం కష్టం సార్. కాని - ఒక్కసారి ప్రయత్నించండి...... పదిహేన్నేళ్ల క్రితం...... నేను మరికొందరి మిత్రులతో మీ ఇంటి కెదురుగా...... చేతిలో పాలపాకెట్లతో...... సార్ నా పేరు కూడా మీ పేరే... కృష్ణ."

అప్పుడు వెలిగింది కృష్ణచైతన్యకి.

......ఎందుకూ కొరగాకుండా పోతాడని తాననుకున్న కృష్ణ ఇంత ఎదిగాడా?

"కూర్చోండి".

కూర్చున్నాడు తిరిగి.

కూల్ డ్రింక్స్ తెప్పించాడు కృష్ణ.

"పాలపాకెట్లమ్ముకున్న వాడేనిటి? ఓ కంపెనీకి జి.ఎమ్. ఏమిటి? ఇది సినిమా కాదే అని ఆశ్చర్యపడుతున్నారా?"

"కాదు...... కాని ఏమాత్రం ఛాలెంజీ, రిస్కూ లేని నువ్వేమిటి ఇంతలా ఎదగడమేమిటి అని అబ్బురపడుతున్నాను." అన్న మాటల్ని బయటికి అనలేదు కృష్ణచైతన్య.

"ఆశ్చర్యం ఏమీ లేదు సార్, ఇందులో ఒక రకంగా నేనీ స్థితికి చేరుకోవడానికి మీరే కారకులు."

"నేనా?"

"అవును".

"అదెలా"?

"ఆ రోజు మీరు నాతో అన్న మాటలు నాకే తెలియకుండా నాలో అదోరకం ఉత్తేజాన్ని కలిగించాయి. మా అమ్మ చెప్పింది తప్పనిపించింది. మర్నాడే నేనూ మా వాళ్ళతో కలిసి ఆడాను...... కాని ఓడిపోయాను."

క్షణం ఆగి తిరిగి చెప్పసాగాడతను. "ఆ ఓటమి నాలో కసినిప్పు కలిగించింది. అమ్మ మాటల్లోని యదార్థం ఆ రోజు రాత్రి కనిపించింది నాకు పైసా లేకుండా ఇంటికి తిరిగొచ్చి అమ్మను చూసినప్పుడు. ఆ తరువాత నేనెప్పుడూ ఆడలేదు. కాని- మీరు చెప్పిన వైకుంఠపాళి నిర్వచనం మరోలా అర్థమయ్యింది నాకు. నిజమే సార్, జీవితం వైకుంఠపాళి లాంటిదే. కాని...... అన్ని మెట్లూ త్వరగా ఎక్కి పైకి చేరుకుంటే పైనున్న పెద్ద పాము కాటుపడి మళ్ళీ ప్రారంభించిన చోటికే చాలాసార్లు చేరుకోవలసిన అవసరం రావచ్చు. అది ఆట కాబట్టి ఎన్నిసార్లన్నా అలా పైకి వెళుతూ వుండగలం. కాని జీవితంలో అలా మళ్ళీ మళ్ళీ ఓటమి ఎదురైతే మనిషి అయి అసలేమీ చేయలేని స్థితికొస్తాడు...... మా రంగడిలా......

"రంగా ఎవరూ?"

'వాడే...... దాదాపు ప్రతీ రోజూ ఆటలో పాలపాకెట్లన్నీ గెలుచుకొని వెళ్ళేవాడు.

"ఏమయిందతనికి?"

"ఆత్మహత్య చేసుకున్నాడు."

ఓ రెండు క్షణాలు అలా చూస్తూండిపోయి, చివరికి గొంతు సర్దుకొని అడిగాడు చైతన్య.

"ఎందుకు"?

"మనశ్శాంతిలేక...... సినిక్ అయిపోయి."

నిముషం మౌనంగా వున్నారిద్దరూ.

కూల్ డ్రింక్స్ పూర్తయ్యాయి.

"నేను రోజూ సంపాదనతోనే తృప్తిపడడంతో కోరికలు అనవసరమైన ఆశలూ నా దరికి రాలేదు. పైసా పైసా కూడబెట్టి వీధి దీపాల్లో చదువుకొని డిగ్రీ పూర్తి చేశాను. ఏనాడూ అమ్మగాని, నేను గాని ఖాళీ కడుపులతోనూ, కుతకుతలాడే మనసుతోనూ పడుకోలేదు.

డిగ్రీ కాగానే చిన్న షాపులో కొన్ని రోజులు పద్దులు రాశాను. తరువాత ఓ చిన్న కంపెనీలో సేల్స్ మేన్‌గా చేరాను.

బాగా పని చేశాను - నిస్వార్థంగా...... సేల్స్ రిప్రజెంటేటివ్‌నీ టార్గెట్స్ అందుకోవడం, అధిగమించడంతో సేల్స్ ఆఫీసర్‌నీ కాగలిగాను...... ఆ తరువాత ఇదిగో ఈ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా ఆఫర్‌స్తే చేరి జనరల్ మేనేజర్‌నీ అయ్యాను. అయితే వైకుంఠపాళిలోని పై మెట్టు మీద దృష్టి నిలపలేదు నేను. నా తరువాతి గడి పాము తల వున్నది కాకుండా వస్తే చాలనే జాగ్రత్తతో వుండి పనిచేశాను. అన్నింటినీ మించి, తృప్తి, మనశ్శాంతి వుండడంతో మనస్ఫూర్తిగా పనిచేస్తూ ఎక్కువ విజయాలు సాధించగలిగాను."

చాలా సేపు ఏమీ మాట్లాడలేదు కృష్ణ చైతన్య.

నిజమే...... ఓ సంస్థ అధిపతినని మురిసిపోయాడొకప్పుడు తను. కాని ఏం సాధించగలిగాడు???

ఒక్కరోజు...... కనీసం ఒక్క క్షణమైనా సీతని సుఖపెట్టలేదు......

తనైనా సుఖపడ్డాడా? లేదు...... అసలు మనశ్శాంతి అనేది ఎలా వుంటుందో తనకి తెలీదు.

పాండవుల వనవాసం కొన్ని సంవత్సరాలే......

కాని తను అనుక్షణం వనవాసమే చవి చూశాడు.

కడుపునిండా భోంచేసి, హాయిగా, ప్రశాంతంగా ఎన్ని రోజులు పడుకోగలిగాడు తను???

"పెళ్ళయ్యిందా?" అడిగాడు.

"ఆ... పాపకి మూడేళ్ళు" హాయిగా నవ్వాడు కృష్ణ.

"పేరు?"

"నా భార్య పేరు శాంతి."

"పాప పేరు..."

చిన్నగా నవ్వాడు కృష్ణ.

"తృప్తి"...

లేచాడు చైతన్య... "వెళ్ళొస్తాను... సార్."

"నన్నుసార్ అనకండి...... నాకదోలా వుంటుంది. అన్నట్టు మీ అబ్బాయిని రేపే పంపించండి."

"పంపిస్తాను బాబూ. అంతేకాదు. ఎలాగైనా వాడికి నీ దగ్గర ఉద్యోగం ఇప్పిస్తే నా అదృష్టంగా భావిస్తాను. జీతం ఎంతైనా ఫరవాలేదు. నీ దగ్గర అతను చేరాలి."

ప్రశ్నార్థకంగా చూశాడతని వైపు కృష్ణ.

తలవంచుకున్నాడు కృష్ణచైతన్య.

"మరేం లేదు బాబూ...... ఉద్యోగం లేక ఖాళీగా కూర్చోవడం ఎందుకని ట్యూషన్స్ చెబుతున్నాడు మరో ఫ్రెండ్‌తో కలిసి. ట్యూషన్స్‌కి వచ్చే పిల్లల్ని బొమ్మా బొరుసా వేసి ఇద్దరూ పంచుకోవడం చూశాను నిన్న...... నిన్న ఆ దృశ్యం చూసి గర్వపడ్డాను పైకొస్తాడని. ఈ రోజు... ఈ రోజు అది తలచుకొని సిగ్గుపడుతున్నాను. భయపడుతున్నాను. ప్లీజ్... ఎలాగైనా వాడికి నీ దగ్గరే ఉద్యోగం ఇవ్వు బాబూ...... రేపే పంపిస్తా." గొణుక్కుంటూ నెమ్మదిగా బయటికి వెడుతున్న చైతన్యకేసి చూస్తూండిపోయాడు కృష్ణ. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. ●

**నిద్ర**

"ఈ రాత్రి కోసమని ఎన్నో రాత్రులు నిద్ర లేకుండా గడిపాను పద్మా" శోభనం గదిలోకొచ్చిన భార్యతో పరవశంగా అన్నాడు శ్రీనివాసులు.

"అందుకని ఇప్పుడు కొంపదీసి గుర్రుపెట్టి నిద్ర పోరు కదా?" కంగారులో గభాల్న అడిగేసింది పద్మ.

-పద్మశ్రీ (మాణిక్యారం)